సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మియాపూర్ : లక్ష్మీ విహార్ లేక్‌వ్యూ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు లక్ష్మీ విహార్ ఫేజ్–1, 2 నల్లగండ్ల విలేజ్ ఆదిత్య బ్యాక్‌సైడ్ ఏరియా, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్ శ్రీ కృష్ణకాలనీ, డిమార్ట్ ఏరియా, నల్లగండ్ల వీకర్ సెక్షన్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో, జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణ పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాజ్‌కుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు చందానగర్ మెయిన్‌రోడ్డు, బీహెచ్‌ఈఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా లక్ష్మీవిహార్ కాలనీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ సురేందర్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని లక్ష్మీవిహార్ ఫేజ్ 1, 2 కాలనీల్లో, నల్లగండ్ల విలేజ్, ఆదిత్య అపార్టుమెంట్ బ్యాక్‌సైడ్ ఏరియాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

లేక్ వ్యూ ఫీడర్ పరిధిలో...

లేక్ వ్యూ 11 కేవీ ఫీడర్ పరిధిలో మ.2 గం నుంచి సా. 5 గంటల వరకు లేక్ వ్యూ అపార్టుమెంట్, శ్రీకృష్ణ కాలనీ, డి మార్ట్ ఏరి యా, నల్లగండ్ల వీకర్ సెక్షన్ కాలనీలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డీఎల్ఎఫ్ పరిసరాలు, డాగ్ పార్క్, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సాయి ఐశ్వర్య కాలనీ, సాయి వైభవ్ కాలనీ, జైన్ కన్‌స్ట్రక్షన్స్, ఖాజాగూడ విలేజ్, ఖాజాగూడ వీకర్ సెక్షన్, సాయి కృపా కాలనీ, నిహారిక కన్‌స్ట్రక్షన్స్, కరాచీ బేకరీ మెయిన్ రోడ్, చిత్రపురి కాలనీ, ల్యాంకో టవర్స్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జయభేరి ఎన్‌క్లేవ్, ఓల్డ్ గచ్చిబౌలి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బిల్డర్ కార్యకలాపాలు..

- నివాసితుల ఆందోళనతో కోర్టుకు వెళ్లామన్న సొసైటీ సభ్యులు

సాక్షి,సిటీబ్యూరో: గోపన్‌పల్లిలోని హానర్ వివంతీస్ బిల్డర్ జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలను నిర్వహిస్తూ సదరు నివాసితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని హానర్ వివంతీస్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కార్పోరేటివ్ సొసైటీ సెక్రటరీ సుబ్బారావ్ తెలిపారు. నివాసితులు ఫ్లాట్లను కొన్న తరువాత కూడా వివిధ రకాలుగా బిల్డర్ వేధిస్తున్నారని అన్నారు. సదరు బిల్డర్ టాటా ప్రాజెక్ట్ పేరుతో ప్రకటనల్లో, కరపత్రాల్లో ప్రచారం చేస్తూ తన ఫ్లాట్లను అమ్ముకుంటూ మోసం చేస్తున్నారని చెప్పారు. బిల్డర్ నిర్మించిన ఫ్లాట్లు జీహెచ్‌ఎంసీ నిబంధనలకు తూట్లు పొడిచేలా ఉన్నాయని, నాణ్యత లేకుండా పగుళ్లు, లీకేజీలతో నివాసితులకు అసౌకర్యంగా ఉన్నాయన్నారు. తన నిర్వాకానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన నివాసితుల ఆధ్వర్యంలో గత ఏడాది ఆగస్టులో టీఎమ్ఏసీఎస్ చట్టం 1995 ప్రకారం ఫిర్యాదు చేశామన్నారు. తర్వాత కూడా తమ సొసైటీకి వ్యతిరేకంగా బిల్డర్ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. బిల్డర్ ఇప్పటికీ క్లబ్ హౌస్‌ను ధనార్జన కోసం వాడుకుంటున్నారని, దీన్ని అరికట్టడానికి నివాసితుల లీగల్ బాడీ ఆధ్వర్యంలో కోర్టుకు వెళ్లామని వివరించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించినట్లు పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 27 మంది పట్టుబడగా, వీరిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చారు. విచారణ అనంతరం జడ్జి 23 మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు, మరో ఇద్దరికి రూ.3వేల చొప్పున, మరో ఇద్దరికి రూ.5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కిలో రూపాయల్లో... టమాట 10–15, పచ్చిమిర్చి 50, బెండ 60–70, కాకర 40, దొండ 50, దోస 50, ఆలు 30, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 30, గోకర 40–50, బీన్స్ 40, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 40–50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 40–50, ఉల్లి 100 (4–5 కేజీలు), ములక్కాయలు (1) 15 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 80, వెల్లుల్లి 80.

అడుగు దాటని ప్రతిపాదనలు

- వినాయక్‌నగర్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎప్పుడో..?
- రోడ్డు దాటాలంటే పాదచారులకు నరకమే..



వినాయక్‌నగర్ వద్ద గ్రిల్స్ మధ్య నుంచి రోడ్డు దాటుతున్న ఐటీ ఉద్యోగులు

గచ్చిబౌలి: రోడ్డు దాటడానికి పాదచారుల కష్టాలు చెప్పనలవి కాదు. గచ్చిబౌలి– శేరిలింగంపల్లి డివిజన్‌ల మధ్య ఉన్న వినాయక్‌నగర్‌లోని ప్రధాన రహదారిపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఐటీ ఉద్యోగులు, వందలాది మంది పాదచారులు రోడ్డు దాటుతుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో డ్యూటీలు ముగిశాక హాస్టళ్లలో నివాసం ఉండే వారికి రోడ్డు దాటడం తప్పనిసరి అవుతోంది. ఏపీహెచ్‌బీ కాలనీ, జేవీజీ కాలనీ, కేంద్రీయ విహార్, ఇందిరానగర్, గచ్చిబౌలి, వినాయక్‌నగర్, లక్ష్మీ ఎన్‌క్లేవ్, యూకో బ్యాంక్ లేన్, జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో ఐటీ ఉద్యోగులతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు నివాసం ఉంటున్నారు. మెహిదీపట్నం, లింగంపల్లి వైపు, డీఎల్ఎఫ్, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మాదాపూర్, రాయదుర్గం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు రోడ్డు దాటడం తప్పని సరి. అంతే కాకుండా వినాయక్‌నగర్ సర్వీస్ రోడ్డులో హోటళ్లు, షాపింగ్‌కు వచ్చే పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆరేళ్ల క్రితమే ప్రతిపాదన..

ఇందిరానగర్‌లో ఆరేళ్ల క్రితమే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అయితే జీహెచ్‌ఎంసీ అధికారులు పెద్దగా పట్టించుకోలేదు.



వినాయక్‌నగర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు అనువైన చోటు ఇదే..

ఇందిరానగర్‌లో పెడస్ట్రియన్ సిగ్నల్ ఏర్పాటు చేసి వదిలేశారు. వినాయక్‌నగర్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు రెండు వైపులా సర్వీస్ రోడ్లు ఉన్నాయి. అయినా జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రోడ్డు మధ్యలో గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో ఇందిరానగర్‌లో ఉన్న పెడస్ట్రియన్ సిగ్నల్ వద్ద రోడ్డు దాటాల్సి ఉంటుంది. వినాయక్ నగర్ నుంచి దూరం కావడంతో ఏపీహెచ్‌బీ, జేవీజీ కాలనీ, కేంద్రీయ విహార్ నుంచి వచ్చే వారు గ్రిల్స్ మధ్య నుంచి రోడ్డు దాటుతున్నారు. గచ్చిబౌలి ఫ్లైఓవర్ వైపు నుంచి వేగంగా వాహనాలు దూసుకొస్తున్నాయి. దీంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రోడ్డు దాటేందుకు నిత్యం ఐటీ ఉద్యోగులు సాహసమే చేస్తున్నారు.



ఇందిరానగర్‌లో పెడస్ట్రియన్ సిగ్నల్ వద్ద రోడ్డు దాటుతున్న పాదచారులు

గ్రిల్స్ మధ్యలోంచి రోడ్డు దాటుతున్నారు



వినాయక్‌నగర్ వద్ద రోడ్డు దాటాలంటే ఇందిరానగర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కంపెనీలకు వెళ్లే ఐటీ ఉద్యోగులు నిత్యం గ్రిల్స్ మధ్యలోంచి రోడ్డు దాటుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వేగంగా వచ్చే వాహనాలతో ముప్పు తప్పదు. గతంలో ఇందిరానగర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రతిపాదించారు. ఎలాంటి ఆచరణకు నోచుకోలేదు. వినాయక్‌నగర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి అవసరం ఉంది.

– సురేందర్, ఏపీహెచ్‌బీ కాలనీ

ట్రాఫిక్ పోలీసులు గుర్తించాలి



పాదచారులు ఎక్కువగా ఉన్న చోట ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా సర్వే నిర్వహిచాలి. ట్రాఫిక్ సమస్యలపై జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సూచించారు. వందల సంఖ్యలో ఉన్న హస్టళ్లను, ఐటీ ఉద్యోగులను దృష్టిలో ఉంచుకొని ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి. డివైడర్ మధ్యలో గ్రిల్స్ ఏర్పాటు చేసినప్పటి నుంచి గ్రిల్స్‌ను వెడల్పు చేసి రోడ్డు దాటుతున్నారు. పొంచి ఉన్న ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని నివారణ చర్యలు తీసుకోవాలి.

– పూర్ణచందర్‌రావు, కేంద్రీయవిహార్

సగరుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: సగరుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం అంజయ్యనగర్ సగర సంఘం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంజయ్యనగర్ అభివృద్ధి కోసం సగరులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంజయ్యనగర్ సగర సంఘం అధ్యక్షులు నర్సింహ్మ సాగర్, ప్రధాన కార్యదర్శి గడ్డపార రవి సాగర్, కోశాధికారి రవి సాగర్, చంద్రమోహన్ సాగర్, రాజు సాగర్, సత్యనారాయణ సాగర్, మహిళ నాయకురాళ్లు కృష్ణ కుమారి, విమల, రేణుక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీని కలిసిన అంజయ్యనగర్ సగర సంఘం సభ్యులు

బహుమతుల పంపిణీ

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్ కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ హాజరై ముగ్గులను పరిశీలించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ సభ్యులు అనిల్ కావూరి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1997 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆనాటి మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గురువులు వెంకటనరసయ్య, కొమరయ్య, శ్రీరామ్, పూర్వ విద్యార్థులు సురేందర్ రెడ్డి, సుభాన్ రెడ్డి, రమాదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ పుష్ప నగేష్

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాకతీయనగర్‌లో సీసీ రోడ్డు పనులకు సోమవారం కార్పొరేటర్ పుష్ప నగేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ నెంబర్ 4లో సీసీ రోడ్డు గురించి స్థానికులు అనేకమార్లు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో నిధులు మంజూరు చేయించి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. నిత్యం కాలనీలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు సంజీవరెడ్డి, శ్రీపతి రవీందర్, నరేంద్రబాబు, రమేష్, నాయక్‌లు పాల్గొన్నారు.

ముగ్ధ మనోహరం..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్తకళా ప్రదర్శనలో భాగంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి మాధురి నెల్వగల్ నృత్యాంజలి, పుష్పాంజలి, గణేశశ్లోక, కౌత్వం, అష్టపది అంశాలను ప్రదర్శించి అలరించింది. చిన్మయి నృత్య గురువు శ్రీదేవి ముంగర శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. కళాకారులు జాహ్నవి, రిగదా, శ్రావ్య, సాయినిత్య, అన్వి సంకేత, తన్వి రాజస, జాన్వీ కళాకారులు వాణీపరాకు, గణేశా పంచరత్న, కృష్ణశబ్దం, చరిష్ణు, అయిగిరి నందిని మంగళం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.



మనూలో ఫౌండేషన్ డే లెక్చర్

రాయదుర్గం: 'మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం' అనేది జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రధాన ఉర్దూ సంబంధిత సంస్థగా గుర్తింపు తెచ్చుకుందని మాజీ వీసీ ప్రొఫెసర్ ఏఎం పఠాన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీలోని డీడీఈ ఆడిటోరియంలో 'మనూ' 26వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫౌండేషన్ ఉపన్యాస కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో లక్షలాది మంది అభ్యాసకులకు ఉర్దూ భాషలో ఆధునిక విద్య, నైపుణ్యాలను అందించడానికి ప్రయత్నిస్తుందన్నారు.' మనూ' ఉనికిలో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న తరుణంలో నేను భాగస్వామినైనందుకు గౌరవంగా భావిస్తున్నానన్నారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ మనం ఏదైనా అంశంపై చర్చించినప్పుడల్లా గతం, వర్తమానం, భవిష్యత్ మధ్య పరస్పర సంబంధం ఉంటుందన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఓ వ్యక్తిని ఆటో ఢీకొట్టగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం నెల్లూరుకు చెందిన సయ్యద్ రహమతుల్లా(48) పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండలో మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంద్రేశం వైన్స్ సమీపంలో నడుచుకుంటు వెళ్తుండగా పటాన్‌చెరు వైపు నుంచి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రహమతుల్లాను చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని..



బందయ్య

మియాపూర్: ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది ఎస్ఐ యాదగిరి రావు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కలుగురిగి జిల్లా సులేపేట్ మండలం యాకాపూర్ గ్రామానికి చెందిన కలాల్ బందయ్య(35)భార్య జ్యోతి ఇద్దరు కూతుర్లు శృతి,నందినీలతో కలిసి సంవత్సరం క్రితం నగరానికి వచ్చి మియాపూర్‌లోని న్యూ కాలనీలో ఉంటున్నాడు. బందయ్య స్థానికంగా కూలీ పనిచేయగా భార్య జ్యోతి స్థానిక పాఠశాలలో ఆయాగా పనిచేస్తుంది. గత కొన్ని రోజుల నుంచి బందయ్య పనికి వెళ్లడం లేదు. కూలీ పని చేయ లేనని వాచ్‌మెన్‌గా చేస్తానని చెబుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం భార్య జ్యోతి స్కూల్ లో పనికి వెళ్లింది. భర్త బందయ్య ఇంటి వద్దనే ఉన్నాడు. మధ్యాహ్నం 1 గంట సమయంలో పెద్దకూతురు శృతి వచ్చే చూసేసరికి ఇంట్లో బందయ్య ఉరివేసుకుని కనబడ్డాడు. వెంటనే తల్లి జ్యోతికి సమాచారం అందించడంతో ..స్థానికుల సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. 2023 సంవత్సరానికిగాను 27వ ట్రెండీస్ ఇన్ బయోకెమిస్ట్రీ ఒరేషన్ లెక్చర్ అవార్డుకు హెచ్‌సీయూ ప్రొఫెసర్ నడింపల్లి శివకుమార్ ఎంపికయ్యారు. శివకుమార్ హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్‌గా ఉన్నారు. ఈ అవార్డును ఇటీవల మైసూర్‌లోని జేఎస్ఎస్ఎస్ టెక్నికల్ యూనివర్సిటీలో ఆయన అందుకున్నారు. ట్రెండీస్ అనేది భారతదేశంలోని ఒక శాస్త్రీయ వేదిక. ఇది పరిశోధనా రంగంలో అత్యుత్తమ సహకారాన్ని అందించిన, జాతీయంగా, అంతర్జాతీయంగా తమ విద్యా ప్రయత్నాలలో నైపుణ్యాన్ని నిరూపించుకున్న ఫ్యాకల్టీలను గుర్తించి ఈ అవార్డును అందిస్తుంది.



ఒరేషన్ లెక్చర్ అవార్డును స్వీకరిస్తున్న హెచ్‌సీయూ ప్రొ. శివకుమార్

శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట

- త్వరలో కొల్లూర్‌లో నూతన పోలీస్‌స్టేషన్
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : శాంతిభద్రతల పరిరక్షణకు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి తెల్లాపూర్‌లో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు నూతన పెట్రోలింగ్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో 24 గంటలు వాహనాలు పెట్రోలింగ్ నిర్వహిస్తాయని తెలిపారు. ఎవరైనా ఫోన్ చేసిన వెంటనే ఐదు నిమిషాల్లో పెట్రోలింగ్ వాహనం అక్కడికి చేరుకునే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. క్రైమ్ జరిగే హాట్ స్పాట్లను గుర్తించి సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో ఈ పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు.

కంటివెలుగుపై ఎమ్మెల్యే సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలు దేశానికి ఆదర్శమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ క్యాంపు కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కంటి వెలుగు కార్యక్రమం ఉంటుందని, నియోజకవర్గంలోని ప్రతీ కాలనీ, బస్తీలలో కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైన వారికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాల పంపిణీ, కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శంకరయ్య, సర్కిల్ డీసీలు వెంకన్న, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సృజన, కార్పొరేటర్లు హమీద్‌పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, గంగాధర్‌రెడ్డి, రోజాదేవి రంగారావు, మంజుల రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బడ్జెట్లో 10 శాతం విద్యకు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రజిని

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ కార్యదర్శి డా.రజిని

హఫీజ్‌పేట్ : నూతన విద్యా విధానం మహిళలకు శాపంగా మారిందని, ఈ విధానాన్ని రద్దు చేసి కేంద్ర బడ్జెట్లో 10 శాతం విద్యకు కేటాయించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ కార్యదర్శి డాక్టర్ రజిని అన్నారు. సోమవారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో షేక్ ఫాతిమా జయంతి వేడుకలను ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లిం సమాజం కోసం కాకుండా సమాజంలో వివక్ష, అణిచివేత, అన్యాయాలకు అవిద్యకు గురైన అన్ని వర్గాల ప్రజల కోసం ఆమె పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, ఉపాధ్యాయురాలు ఛాయాదేవి, జ్యోతి శ్రీమాన్, పడాల నళిని, కృష్ణ కుమారి, కల్పన, విజయ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బేస్‌బాల్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ సూర్య చంద్రారెడ్డి తదితరులు

మియాపూర్: 7వ సీనియర్ యూత్ జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో చందానగర్‌లోని ఆరోహాన్ ది కంప్లీట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేరళలో మూడు రోజుల పాటు జరిగిన టోర్నమెంట్ పోటీల్లో ఆరోహన్ ది కంప్లీట్ స్కూల్ నుంచి 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచి జూనియర్ జట్టు బాలికల టీం ద్వితీయ స్థానంలో నిలిచింది. సీనియర్ జట్టు తృతీయ స్థానంలో నిలిచి సత్తా చాటింది. సోమవారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సూర్య చంద్రారెడ్డి కప్పు, పతకాలను అందజేసి అభినందించారు.

తహశీల్దార్‌కు వినతి

శేరిలింగంపల్లి: రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు కోల్పోతున్న పేదలకు డబుల్ ఇళ్లను కేటాయించాలని శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు బీఎస్పీ శేరిలింగంపల్లి అధ్యక్షులు రాములు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ గత 20 ఏళ్ళుగా హైటెక్ సిటీ వెళ్లే రోడ్డులో హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ నుంచి సివిల్ సప్లై గోదాం వరకు, అదే విధంగా రైల్వే స్టేషన్ రోడ్డులోను 500 మంది ఉంటున్నారని, వారికి ఓటు హక్కుతో పాటు రేషన్, ఆధార్ కార్డులు, ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఉన్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ రోడ్డు విస్తరణ వలన వారు రోడ్డున పడుతున్నారని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, చంద్రకాంత్, వీరస్వామి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు